క్లుప్తంగా

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు



పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి స్థానిక నాయకుడు పిన్నింటి సునీల్‌రావు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును నివాసంలో మంగళవారం కలిసి దరఖాస్తు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేతో సునీల్ మాట్లాడారు. తనకు అధ్యక్ష పదవి ఇప్పించి మండలంలో పార్టీ బలోపేతానికి బాటలు వేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు జూలపెల్లి గంగాధర్‌రావు, చింతకుంట్ల మల్లికార్జున్, జూలపెల్లి సురేందర్‌రావు, నారెడ్ల సారయ్య, దారం పూర్ణచందర్, వర్దినేని సతీశ్‌రావు, చింతపట్ల అజయ్‌రావు, చింతపట్ల నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తొర్రూరు రూరల్ : మండలంలోని ఎర్రసోమ్లా తండా సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను లారీ ఢీకొట్టగా ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఈదులగడ్డ తండాకు చెందిన ధరావత్ రాంధన్‌నాయక్(45) తన బైక్‌పై పర్వతగిరి నుంచి తొర్రూరు మీదిగా తిరుమలగిరి వైపు టీక్యాతండాకు బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న కారును దాటివేసే ప్రయత్నం చేయగా, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య మంగమ్మతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.

'స్వేరో పలకరింపు'

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారుడు గోవిందు ఉదయ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా స్వేరో స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఉదయ్‌కుమార్ నివాసం వద్ద 'స్వేరో పలకరింపు' కార్యక్రమం నిర్వహించారు. బాధిత కుటుంబానికి మజ్జిగ, పండ్లు, పండ్ల రసాలు అందజేశారు. అనంతరం స్టడీ సర్కిల్ రాష్ట్ర అధ్యక్షుడు మంద శ్యామ్ మాట్లాడారు. జ్ఞాన సమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యమని తెలిపారు. ఉదయ్ కుటుంబానికి స్వేరో సర్కిల్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్వేరో రాష్ట్ర, జిల్లా బాధ్యులు చింత సదానందం, బోళ్ల ప్రశాంత్, దూడెల సిద్ధు, మధూకర్, కందకట్ల ప్రవీణ్, జయరాజ్, జన్ను ప్రవీణ్, చందు, మనోజ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని రాయపర్తి, ఏకేతండా, కొత్తూరు, కొండూరు, జేతురాంతండా, బురహన్‌పల్లి, జయరాంతండా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అలాగే రాయపర్తిలో కంతుల ఉప్పలయ్య మృతి చెందగా ఆయన మృతదేహానికి ఝాన్సీరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ టీఎం.కృష్ణమాచార్యులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు రెంటాల గోవర్ధన్‌రెడ్డి, నంగునూరి అశోక్, మహేందర్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, చిర్ర మల్లయ్య, రత్నాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి



గీసుకొండ : టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడిగా గంగదేవిపల్లికి చెందిన గూడ సంపత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశం సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. పరిశీలకుడిగా మూజ వెంకట్రాజం, వరంగల్ పార్లమెంట్ నియోజవకర్గ అడహక్ కమిటీ కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా చెరుకుపెల్లి సాంబరెడ్డి, వాంకుడోతు నందనాయక్, ఉపాధ్యక్షుడిగా కామని భాస్కర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చిన్నపెల్లి సదానందం, చిందె చిరంజీవరావు, బొల్లు మల్లయ్య, కార్యదర్శులుగా గద్దె సతీశ్ చౌదరి, మామిండ్ల లింగమూర్తి, కోశాధికారిగా తాటి సాంబశివరావు ఎన్నికయ్యారు.

'రాజీవ్ యువ వికాసం'పై ఆశలు



పక్క ఫొటోలో కనిపిస్తున్న యువకుడు మండల కేంద్రానికి చెందిన త్రికోవెల మురళి. ఇతను రుణం కోసం రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకున్నాడు. ప్రస్తుతం హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే ఆశతో రుణ మంజూరీకి ఎదురు చూస్తున్నాడు. ఇలా మండలానికి చెందిన అనేక మంది నిరుద్యోగ యువతీ యువకులు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. రుణం మంజూరైతే ఉపాధి లభిస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నారు.

నిరుద్యోగ యువత ఎదురుచూపులు

- సిబిల్‌పై ఆందోళన



అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, పక్కన తహసీల్దార్ ముప్పు కృష్ణ (ఫైల్)

నల్లబెల్లి : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిట పథకాన్ని అమల్లోకి తీసుకురాగా మండల వ్యాప్తంగా 1823 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందదులో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 281, ఎస్టీ కార్పొరేషన్ రుణాల కోసం 348, బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 1123, ఈబీసీ కార్పొరేషన్ రుణాల కోసం 35, మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం 35, మైనార్టీ కార్పొరేషన్ రుణం కోసం ఒక దరఖాస్తు అందాయి.

రుణాల మంజూరు లక్ష్యం ఇలా

మండలంలో ఎస్సీ కార్పొరేషన్ నుంచి 105, ఎస్టీ కార్పొరేషన్ నుంచి 196, బీసీ కార్పొరేషన్ నుంచి 86, ఈబీసీ కార్పొరేషన్ నుంచి 14, మైనార్టీ కార్పొరేషన్ నుంచి 7, క్రిస్టియన్ మైనార్టీ మైనార్టీ కార్పొరేషన్ నుంచి ముగ్గురికి రుణాలు అందించేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. కాగా క్రిస్టియన్ మైనార్టీ యువతకు మూడు యూనిట్లు లక్ష్యం కాగా కేవలం ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

ఆశతో ఎదురుచూపులు

రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిట రుణాలు అందించేందుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో యూనిట్ల వారీగా జాబితా విడుదల చేసింది. దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేశారు. దరఖాస్తుదారులు హార్డ్‌కాపీలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. దరఖాస్తుదారులకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు అవగాహన కల్పించారు. దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. సిబిల్ స్కోర్ తెలుసుకునేందుకు సంబంధిత బ్యాంకులకు దరఖాస్తుదారుల జాబితా పంపించారు. బ్యాంక్ అధికారుల నివేదిక ఆధారంగా పరిశీలన ముగించి కలెక్టర్‌కు నివేదిక ఇస్తారు.

దరఖాస్తులు పరిశీలిస్తున్నాం



రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను గ్రామాల వారీగా పరిశీలిస్తున్నాం. సిబిల్ స్కోర్ విషయమై ఆయా గ్రామాల దత్తత బ్యాంకులకు లబ్ధిదారుల జాబితా పంపించాము. రుణాలు మంజూరీ, ఇతర అంశాలపై అవగాహన కల్పించాం. పరిశీలన పూర్తి కాగానే ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. ప్రభుత్వం మంజూరు చేయగానే లబ్ధిదారులకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రుణాల మంజూరీ పత్రాలు అందుతాయి.

\- నర్సింహమూర్తి, ఎంపీడీఓ

'భూభారతి'తో సమస్యల పరిష్కారం

- తహసీల్దార్ విజయసాగర్



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయసాగర్, అధికారులు

వర్ధన్నపేట : భూభారతి చట్టంతో రైతుల భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ విజయసాగర్ తెలిపారు. మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన క్రమంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. భూభారతి చట్టంపై రైతులు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. రైతులు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న హెల్ప్‌డెస్క్ ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలని చెప్పారు. రైతుల అందిన 383 దరఖాస్తులను త్వరితగతిన విచారించి అర్హమైన వాటిని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.

అక్రమ నిర్మాణం.. అధికారుల నిర్లక్ష్యం..!

- నోటీసులతో సరి.. చర్యలు శూన్యం



అనుమతి లేకుండా నిర్మిస్తున్న గదులు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలో అక్రమ నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణమని వివాదం చోటు చేసుకోగా అధికారులు నోటీసులతో సరిపెట్టారని, అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తి సంపన్నుడు కావడంతో చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. నర్సంపేటకు చెందిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్‌కు సర్వే నంబర్ 666లో వ్యవసాయ భూమి ఉంది. సదరు భూమిలో రెండు గదుల నిర్మాణం కోసం ఆయన నాలా కన్వర్షన్ చేయించుకుని ప్రభుత్వ అనుమతి తీసుకున్నాడు. కాగా సదరు స్థలంలో కాకుండా వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై తనకున్న మరో స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండానే, సదరు రెండు గదుల నిర్మాణ అనుమతి చూపుతూ అక్రమంగా 5 షట్టర్లు నిర్మిస్తున్నారు. ఒకచోట నిర్మాణానికి అనుమతి తీసుకుని మరో చోట నిర్మాణం చేపట్టడం వివాదాస్పదంగా మారింది. దీంతో అధికారులు ఆయనకు రెండు సార్లు నోటీసులు ఇచ్చారు. అయినా నిర్మాణం కొనసాగుతుండడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు సార్లు నోటీసులు ఇచ్చామని పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు మీడియాకు వెల్లడించారు. సదరు నోటీసులకు బదులు కూడా ఇవ్వలేదని ఆయన చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలుంటాయని కార్యదర్శి తెలిపారు.

కంఠమహేశ్వరుడికి ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే మాధవరెడ్డిని సన్మానిస్తున్న గౌడ కులస్తులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లిలో గౌడ కులస్తుల కంఠమహేశ్వర స్వామి, ఎల్లమ్మ, వనం మైసమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై కంఠమహేశ్వరుడికి, ఎల్లమ్మ, మైసమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌడకులస్తులను ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బొట్టు పెద్దమనిషి కట్ల సుధాకర్, మాజీ సర్పంచ్ ఆరెల్లి వేణు, మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నాయకులు బొబ్బాల రమణారెడ్డి, కత్తి కిరణ్, దూపటి మల్లయ్య, క్రాంతికుమార్, వేముల సాంబయ్య, బత్తిని రాజేందర్, గాజుల రమేశ్, సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



రాయపర్తి : మండలానికి చెందిన 36 మందికి మంజూరైన రూ.11.88 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఆవుల కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ వ్యతిరేకులపై చర్యలు తప్పవు'



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని మండల అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పని చేసిన ఎల్ది శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిపారు. పార్టీ వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. సమావేశంలో నాయకులు చెడిపాక ఉపేందర్, వీరమనేని సాగర్‌రావు, కోరె రాములు, బొమ్మగాని నవీన్, పిండి కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన మేకల నర్సమ్మ (82) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా ఆమె అంత్యక్రియల కోసం స్థానికుడైన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.5 వేల సాయం అందజేశారు. లక్ష్మీనారాయణ పంపిన నగదును గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి బాధిత కుటుంబానికి అందజేశారు. తొలుత నర్సమ్మ మృతదేహానికి రామ్మూర్తి, సోషల్ సర్వీస్ టీమ్ సభ్యురాలు మహ్మద్ సోనీ నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు యాదగిరి కుమారస్వామి, కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ మండల కార్యదర్శి చెన్నకేశవులు



వినతిపత్రం ఇస్తున్న చెన్నకేశవులు, నాయకులు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ శివారులో పనికర గుట్ట సమీపంలో గుడిసెలు వేసుకుని అనేక ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ ఫణికుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం చెన్నకేశవులు మాట్లాడారు. గుడిసెవాసులు 17 ఏళ్లుగా సమస్యల నడుమ జీవితాలు వెళ్లదీస్తున్నారని చెప్పారు. పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టించడంతోపాటు తాగునీటి, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, శంకర్, సావిత్రి, బండారి రాజమ్మ, సాంబయ్య, చెలుకలపల్లి శ్రీనివాస్, సింగం వెంకటలక్ష్మి, ఏలియా, బాగాతి భిక్షపతి, పిట్టల బుచ్చమ్మ, చాగంటి స్వరూప, దంతాల సాంబలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ మహాయాగం



నర్సంపేట రూరల్ : ఆలయానికి నైవేద్యం తీసుకొస్తున్న ఎల్లాగౌడ్

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలోని శ్రీఆంజనేస్వామి ఆలయంలో హనుమాన్ మహాయాగం రెండో రోజు కొనసాగింది. మహాశాస్త్ర తంత్ర పీఠాధిపతి, కేరళ తాంత్రిక ఆచార్యులు బహ్మశ్రీ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో మహాయాగం నిర్వహించారు. పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అన్నదాత శీలం మంజుల ఎల్లాగౌడ్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శోభాయాత్ర

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలో హనుమాన్ భక్తులు మంగళవారం సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ మాలధారాలు నృత్యాలు చేస్తూ గ్రామంలో హనుమాన్ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పెండ్యాల మమత రాజు దంపతులు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి హనుమాన్ భక్తులు శోభాయాత్రలో భాగస్వాములయ్యారు.

'మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు సరికాదు'

దుగ్గొండి : మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను కించపర్చేలా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని మోపా మండల అధ్యక్షుడు ఓరుగంటి తిరుపతి అన్నారు. మండలంలోని గిర్నిబావిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రెడ్డివా.. ముదిరాజ్‌వా? చెప్పాలి' అని రాజేందర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కులాంతర వివాహాలను రాజ్యాంగం చట్టబద్ధం చేసిన విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. కులం పేరుతో వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో నాయకులు జటబోయిన రాజేందర్, అశోక్, బోళ్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


ఆలయ అభివృద్ధికి భూమి కొనుగోలు



ఆలయ కమిటీ బాధ్యులకు భూవిక్రయ పత్రాలు అందజేస్తున్న భద్రమ్మ కుటుంబీకులు

గీసుకొండ : మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ఎదుట ఉన్న ఆడెపు భద్రమ్మకు చెందిన భూమిని కొనుగోలు చేశారు. భద్రమ్మ కుటుంబీకులు ఆలయ కమిటీకి మంగళవారం విక్రయ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, వైస్ చైర్మన్ చాడ సంజీవరెడ్డి మాట్లాడారు. కమిటీ ఆధ్వర్యంలో రూ.4 లక్షలు చెల్లించి భూమి కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఆలయాన్ని మరింత విశాలంగా అవసరమైన వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో గ్రామస్తులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామా కుమారస్వామి, బండారు నరేందర్, ముల్క మార్కండేయ, సత్యనారాయణ, కర్ణకంటి రామ్మూర్తి, భద్రమ్మ కుటుంబీకులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడిగేదె మృతి



గీసుకొండ : మండలంలోని అనంతారంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందింది. రైతు కొంగర విజయ్ తన పాడి గేదెను మేపడానికి తీసుకెళ్లిన సమయంలో గాలి దుమారం వచ్చి పిడుగు పడింది. ఈ ప్రమాదంలో గేదె అక్కడికక్కడే మృతి చెందగా సమీపంలోనే ఉన్న విజయ్ స్పృహ కోల్పోయాడు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

దామెర: పోక్సో కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఏసీపీ సతీశ్‌బాబు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బాలికను సింగరాజుపల్లికి చెందిన యువకుడు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలుపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలిక వాంగ్మూలం తీసుకున్న పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

సైన్స్ గ్రూప్ మంజూరు చేయాలి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం హనుమకొండలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ బి.నర్సింహారెడ్డి వినతిపత్రం అందించారు. కళాశాలలో సైన్స్ గ్రూపు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి సైన్స్ గ్రూపు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి భరోసా ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బియ్యం అందజేత

రాయపర్తి : మండలంలోని జేతురాంతండాకు చెందిన నేతావత్ తారాచంద్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధికార ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి మంగళవారం బియ్యం, నిత్యావసర సరుకులు సాయంగా అందజేశారు. తొలుత తారాచంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. పేద కుటుంబాలకు ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సాయం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు అశ్రఫ్ పాషా, యూసుఫ్, నేతావత్ శ్రీధర్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి నీళ్లు బంద్

ఆత్మకూరు : గ్రామంలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి గ్రామపంచాయతీ సిబ్బంది నీటి సరఫరా నిలిపివేశారని అలాగే వీధి దీపాలు బంద్ చేశారని స్థానికులు మంగళవారం ఆరోపించారు. గ్రామపంచాయతీలో ఇళ్లు నమోదు చేసుకోలేదని, అలాగే పన్నులు చెల్లించడం లేదని సాకుతో నీటి సరఫరా నిలిపివేశారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి

నెక్కొండ : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు బొడ్డుపల్లి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆధ్వర్యంలోని బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లు, రైతులకు వసతులు, ఇతర అంశాలపై అధ్యయనం చేశారు. అనంతరం వెంకన్న మాట్లాడారు. దొడ్డు ధాన్యానికి సైతం బోనస్ ఇవ్వాలని, వర్షానికి తడిచిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని, పొలాల నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు ప్రభుత్వమే ఖర్చులు భరించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉండ్రాతి రాజు, బొడ్డు రవి, లింగాల మల్లయ్య, గజ్జల గోపాల్, కన్నె వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో విద్యార్థుల మానసిక వికాసానికి బాటలు



నర్సంపేట : వేసవి శిక్షణ విద్యార్థుల వికాసానికి బాటలు వేస్తుందని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ద్వారకపేట రోడ్డులోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ఒకటి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను వేసవి శిక్షణ సందర్భంగా మంగళవారం మాధన్నపేట సరస్సు, పాకాలను సందర్శింపజేశారు. విద్యార్థులతో యోగా సాధన చేయించారు. విద్యార్థులకు పాకాల చెరువు, ఆయకట్టు, తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. సెలవుల సందర్భంగా విద్యార్థులకు యోగా, కరాటే, డాన్స్, అబాకస్, భగవద్గీత తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విద్యాసంస్థల కోశాధికారి డాక్టర్ వనజ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక, సామాజిక వికాసమే లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.